సాక్షి ప్రకాశం

ఆదివారం | 19 | నవంబర్ | 2023



ఘనంగా అయోధ్య కలశాల శోభాయాత్ర

అయోధ్య నుంచి ఒంగోలు చేరిన పవిత్ర అక్షతల కలశాలతో వీహెచ్‌పీ ఆధ్వర్యంలో శోభాయాత్ర నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. - 8లో..



300 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

అక్రమంగా లారీలో తరలిస్తున్న 300 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని బేస్తవారిపేట జంక్షన్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
32.6/25.3

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. వాతావరణంలో తేమ శాతం అధికం.

న్యూస్‌రీల్

21న ఎస్‌జీఎఫ్ క్యారమ్స్ జిల్లా క్రీడాకారుల ఎంపిక

ఒంగోలు: ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలోని విద్యార్థులకు అండర్ 14, అండర్ 17 స్కూల్ గేమ్స్ జిల్లా క్రీడాకారుల ఎంపిక ఈనెల 21న స్థానిక హైదరీక్లబ్‌లో నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కె.వనజ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం ఒంటిగంట నుంచి ఎంపిక ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. పూర్తి వివరాలకు సెల్: 9849429839ను సంప్రదించాలన్నారు.

కుల గణన రౌండ్ టేబుల్ సమావేశం రేపు

ఒంగోలు సెంట్రల్: ఈనెల 27 నుంచి జరగబోవు కుల గణనకు సంబంధించి కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల ప్రాంతీయ రౌండ్ టేబుల్ సమావేశం సోమవారం విజయవాడలో నిర్వహిస్తారని ప్రకాశం జిల్లా బీసీ సంక్షేమ సాధికారిత అధికారి ఎం.అంజలి తెలిపారు. విజయవాడలో మెట్రోపాలిటన్ హోటల్ (మెరీ స్టెల్లా కాలేజి ఎదురు) రౌండ్ టెబుల్ సమావేశం ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తారని చెప్పారు. ప్రజా ప్రతినిధులు, జిల్లా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కుల సంఘ నాయకులు అందరూ పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

33 మంది స్టాఫ్ నర్సులకు నియామక పత్రాల అందజేత

ఒంగోలు టౌన్: జిల్లా వైద్యారోగ్య శాఖ పరిధిలోని నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం), ఎన్సీడీ ప్రోగ్రాంలలో ఖాళీగా ఉన్న స్టాఫ్ నర్సులు, ఫిజియోథెరపిస్ట్, మల్టీ రిహాబిలిటేషన్ వర్కర్ పోస్టుల భర్తీ పూర్తయింది. ఈ ఉద్యోగాలకు కాంట్రాక్ట్ పద్ధతి మీద నియామకాలు చేపట్టడం తెలిసిందే. ఇందులో భాగంగా విద్యార్హతల, దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ పూర్తి చేసి 33 మంది స్టాఫ్ నర్సులకు నియామక పత్రాలను అందజేసినట్లు జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్.రాజ్యలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 39 మందికి గాను 33 మందికి నియామక పత్రాలు అందజేశామని, మిగిలిన ఆరుగురికి కూడా రోస్టర్ ప్రకారం మెరిట్ ప్రతిపాదిక మీద నియమించనున్నట్లు తెలిపారు. అలాగే ఓక ఫిజియోథెరపీ, 7 మల్టీ రిహాబిటేషన్ పోస్టులను కూడా భర్తీ చేసినట్లు వెల్లడించారు. ఈ నియామకాలకు సంబంధించి ఎవరైనా వ్యక్తులు ప్రలోభాలకు గురిచేసినట్లైతే వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు. మధ్యవర్తుల మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు.

నేడు రహదారి ప్రమాదాలపై వాక్‌థన్, ర్యాలీ

ఒంగోలు సెంట్రల్: ప్రపంచ వ్యాప్తంగా మూడో ఆదివారం రహదారి భద్రతపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని ఉప రవాణా కమిషనర్ ఆర్ సుశీల తెలిపారు. అందులో భాగంగా ఆదివారం రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన, మృతి చెందిన వారి కుటుంబ సభ్యులతో రహదారి భద్రతపై చర్చిరోడ్ నుంచి వాక్‌థన్, ర్యాలీ నిర్వహిస్తారని తెలిపారు.

బిగ్ డే..బిగ్ స్క్రీన్

ఎవరి నోట విన్నా క్రికెట్ ప్రపంచకప్ ఫైనల్ గురించే..రెండు దిగ్గజ జట్లు ఇండియా, ఆస్ట్రేలియాల మధ్య .. అందులోనూ ఆదివారం.. క్రికెట్ ప్రేమికుల ఆనందాలకు హద్దే లేకుండా పోయింది. వీరికోసం రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ బిగ్‌స్క్రీన్‌లను ఏర్పాటు చేస్తోంది. అహ్మదాబాద్ వేదికగా జరిగే ఈ మ్యాచ్‌ను 5 వేల మంది వీక్షించేలా నగరంలోని మినీ స్టేడియంలో భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. జిల్లా అంతటా పలు ప్రాంతాల్లో పెద్ద స్క్రీన్‌లు ఏర్పాటు చేస్తున్నారు.

- క్రికెట్ వరల్డ్ కప్ ఫైనల్ చూసేద్దాం రండి
- క్రీడాభిమానుల కోసం ఒంగోలు మినీస్టేడియంలో భారీ స్క్రీన్
- 5 వేల మంది క్రీడాభిమానులు వీక్షించేందుకు వీలుగా ఏర్పాట్లు
- మధ్యమధ్యలో క్రీడాభిమానులకు స్నాక్స్
- ఇండియా విజయాన్ని ప్రత్యక్షంగా చూసేందుకు తరలిరావాలని ఎమ్మెల్యే బాలినేని, ప్రణీత్‌రెడ్డి పిలుపు





ఒంగోలు మినీస్టేడియంలో ఏర్పాటు చేస్తున్న బిగ్‌స్క్రీన్, కుర్చీలు, లైట్లు

ఒంగోలు: ఎక్కడ చూసినా వరల్డ్ కప్ ఫీవర్. నలుగురు ఎక్కడ చేరినా క్రికెట్ ముచ్చట్లే. ఆదివారం ఇండియా–ఆస్ట్రేలియాల మధ్య ఫైనల్. హైఓల్టేజ్ మ్యాచ్‌ను క్రికెట్ అభిమానులు లైవ్‌లో బిగ్‌స్క్రీన్‌లో వీక్షించేందుకు ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్‌ను ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో పెద్ద స్క్రీన్‌లు ఏర్పాటు చేసేందుకు అసోసియేషన్ చర్యలు చేపట్టింది. అందులో భాగంగా ఒంగోలు నగరంలోని మినీ స్టేడియంలో ఐదువేల మంది వీక్షించేలా భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఆదివారం మధ్యాహ్నం నుంచి ప్రారంభమవుతున్న ఈ మ్యాచ్‌ను తిలకించేందుకు హాజరవుతున్న క్రీడాభిమానులకు స్నాక్స్ కూడా అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఏర్పాట్లను పరిశీలించిన బాలినేని:

మాజీమంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, ఆయన తనయుడు బాలినేని ప్రణీత్‌రెడ్డి, ఆంధ్రాక్రికెట్ అసోసియేషన్ జిల్లా అడ్‌హక్ కమిటీ కన్వీనర్ మారెడ్డి వెంకటాద్రిరెడ్డి, సభ్యులు పుల్లంశెట్టి శ్రీనివాసులు తదితరులు శనివారం మినీ స్టేడియంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా స్టేడియంలో కూర్చొనే ప్రతి వ్యక్తికి మ్యాచ్‌ను ఎటువంటి అంతరాయం లేకుండా చూసేలా వేదిక ఉండాలన్నారు. ఏర్పాటు చేస్తున్న స్క్రీన్ సైజును కూడా పరిశీలించారు. అనంతరం బాలినేని మీడియాతో మాట్లాడుతూ యువతలో క్రీడాస్ఫూర్తిని నింపేందుకు, యువతలో క్రీడల పట్ల క్రేజ్ నింపేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయాన్ని ప్రతి ఒక్క క్రీడాభిమాని స్వాగతిస్తున్నారన్నారు. 14 అడుగుల ఎత్తు, 34 అడుగుల వెడల్పుతో స్క్రీన్ ఏర్పాటు చేస్తున్నందున ఈస్క్రీన్‌పై మ్యాచ్‌ను తిలకించడం క్రికెట్ ప్రేమికులకు మరిచిపోలేని ఒక అనుభూతి అన్నారు. యువనాయకుడు బాలినేని ప్రణీత్‌రెడ్డి మాట్లాడుతూ 2011లో ఇండియా ప్రపంచ కప్‌ను గెలుచుకుందని, మళ్లీ 12 ఏళ్ల తరువాత ప్రపంచ కప్ ఫైనల్‌కు చేరుకుందన్నారు. భారత్ గెలవాలనే ఆకాంక్ష ఉన్న ప్రతి ఒక్క క్రికెట్ ప్రేమికుడు ఈ మ్యాచ్‌ను ఇంతటి భారీ స్క్రీన్‌పై తిలకించేందుకు తరలిరావాలన్నారు. భారీ ఎల్‌ఈడీ స్క్రీన్‌తోపాటు క్రీడాభిమానులను ఉర్రూతలూగించేందుకు మంచి సౌండ్‌సిస్టం కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. భారీ లైటింగ్, 5 వేలమందికిపైగా కూర్చునేలా సీటింగ్, మంచి మ్యూజిక్ సిస్టంతో ఎంటర్‌టైన్‌మెంట్, మధ్యమధ్యలో స్నాక్స్‌తో నిర్వహిస్తున్న ఈ మ్యాచ్‌ను తిలకించేందుకు పార్టీలకు అతీతంగా క్రీడాభిమానులు తరలిరావాలని కోరుతున్నామన్నారు. అలాగే నగరంలోని గాంధీపార్కులో కూడా వరల్డ్ లైవ్ క్రికెట్ మ్యాచ్‌ను భారీ స్క్రీన్‌పై ప్రదర్శించనున్నట్లు బాలినేని ప్రణీత్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ అయినాబత్తిన ఘనశ్యాం, కార్పొరేటర్లు ఈదర చిన్నారి, యనమల నాగరాజు, జడా వెంకటేష్ తదితరులు ఉన్నారు.



మినీస్టేడియంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, ప్రణీత్‌రెడ్డి



మినీస్టేడియం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

యర్రగొండపాలెంలో మంత్రి సురేష్ బిగ్ స్క్రీన్ ఏర్పాటు

యర్రగొండపాలెం: ఇండియా–ఆస్ట్రేలియా మధ్య జరిగే క్రికెట్ వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్ తిలకించే అభిమానుల కోసం రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ స్థానిక గాయత్రి థియేటర్‌లో బిగ్ స్క్రీన్ ఏర్పాటు చేస్తున్నారు. క్రికెట్ క్రీడాభిమానులతో కలిసి ఆటను చూసేందుకు మంత్రి, ఆయన తనయుడు, జార్జి విద్యాసంస్థల డైరెక్టర్ ఆదిమూలపు విశాల్ ఆదివారం మధ్యాహ్నం థియేటర్ వద్దకు వస్తారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొప్పర్తి ఓబులరెడ్డి తెలిపారు.

దర్శిలోనూ...

దర్శి: ఫైనల్ మ్యాచ్‌ను బిగ్‌స్క్రీన్‌పై దర్శి ప్రజలకు చూపించేందుకు జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి ఏర్పాట్లు చేశారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బిగ్‌స్క్రీన్ ఏర్పాటు చేశారు. ఆదివారం మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి మ్యాచ్ అయిపోయే వరకు ఈ స్క్రీన్‌పై వరల్డ్ కప్ మ్యాచ్ ప్రసారం చేస్తారని బూచేపల్లి కార్యాలయ ప్రతినిధి సందిరెడ్డి రాజశేఖరరెడ్డి తెలిపారు.

కార్పొరేట్‌కి దీటుగా ప్రభుత్వ వైద్యశాలల సేవలు

- మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి



మాతా శిశు వైద్యశాల ఆవరణలో నాడు-నేడులో నిర్మించిన నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్

ఒంగోలు టౌన్: ప్రైవేటు కార్పొరేట్ వైద్యశాలలకు దీటుగా ప్రభుత్వ వైద్యశాలల్లో ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అనేక చర్యలు తీసుకుంటున్నారని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి చెప్పారు. నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా ఒంగోలులోని మాతా శిశు వైద్యశాలలో నిర్మించిన నూతన భవనాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ రూ.1.76 కోట్ల నిధులతో కొత్త బ్లాక్ నిర్మించడం వలన ఒంగోలు పరిసర ప్రాంతాల ప్రజలకు మరిన్ని వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. ఇప్పుడు ఉన్న 50 పడకలకు అదనంగా మరో 20 పడకలు అందుబాటులోకి రానున్నాయని, ఇందుకోసం నాణ్యమైన వైద్య పరికరాలు కూడా మంజూరయ్యాయని చెప్పారు. దీంతో మరింత మందికి వైద్య సేవలు అందించేందుకు అవకాశం లభించిందని తెలిపారు. గతంలో మాతా శిశు వైద్యశాలలో వైద్యుల కొరత ఉండేదని, జగన్ ముఖ్యమంత్రి అయ్యాక ప్రభుత్వ వైద్యశాలల్లో వైద్యుల కొరత లేకుండా చేశారని చెప్పారు. ప్రస్తుతం ఒంగోలులోని మాతా శిశు వైద్యశాలలో ఆరుగురు గైనకాలజిస్టులు, పీడియాట్రిక్ స్పెషలిస్టులు నిరంతరాయంగా వైద్య సేవలు అందిస్తున్నారని చెప్పారు. పేద, మధ్యతరగతి ప్రజలకు ఉచితంగా కాన్పులు చేస్తున్నారన్నారు. అనుభవం కలిగిన గైనకాలజిస్టులు సాధారణ కాన్పులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్న విషయం తెలుసుకున్న బాలినేని వైద్యులను అభినందించారు. కాన్పులతో పాటుగా పసి పిల్లల కోసం అత్యంత అధునాతన వైద్య సేవలు అందించేందుకు అన్నీ రకాల సౌకర్యాలు ఉన్నాయని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఒంగోలులోని మాతా శిశు వైద్యశాల వలన ఒంగోలు, కొండపి, సంతనూతలపాడు ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉందని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ తెలిపారు. ఇప్పుడు అదనంగా మరో 20 పడకలు ఏర్పాటు చేస్తూ నిర్మించిన నూతన భవనాన్ని ప్రారంభించడం వలన మరింత మందికి వైద్య సేవలు అందించే అవకాశం ఉంటుందని చెప్పారు. వైద్యులు మరింత మెరుగైన సేవలు అందించాలని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. ఐపీహెచ్‌ఎస్ ప్రమాణాలకు అనుగుణంగా నూతన భవనాన్ని నిర్మించినట్లు ఏపీఎంఎస్ఐడీసీ జిల్లా ఈఈ ఎం.విజయభాస్కర్ తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎంఎస్ఐడీసీ డీఈ ఎండీ రత్నం, జేఈ వెంకట్, డీసీహెచ్‌ఎస్ వీఎస్ఎన్ డాక్టర్ మూర్తి, మాతా శిశు వైద్యశాల మెడికల్ ఆఫీసర్ డా.ఈ వెంకటరావు, కార్పొరేటర్లు, వైద్యులు పాల్గొన్నారు.

కుల గణన సర్వే పక్కాగా చేపట్టాలి

- నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు
- కలెక్టర్ దినేష్ కుమార్



కులగణన సర్వేపై వీడియో సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: ఈ నెల 27వ తేదీ నుంచి నిర్వహించాల్సిన కులగణన సర్వే పక్కాగా చేపట్టాలని నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని కఠిన చర్యలుంటాయని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అధికారులను హెచ్చరించారు. నమోదు ప్రక్రియలో సందేహాలుంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. శనివారం జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులుతో కలిసి ప్రకాశం భవనం నుంచి మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలతో వీడియో సమావేశం నిర్వహించారు. దీనిలో కలెక్టర్ మాట్లాడుతూ కులాల వివరాల నమోదులో పొరపాట్లు దొర్లకుండా జాగ్రత్త వహించాలన్నారు. ప్రతి ఇంటిలోని వారి వివరాలను నమోదు చేశాక వలంటీరు, సచివాలయ ఉద్యోగి తప్పనిసరిగా బయోమెట్రిక్ వేయాలన్నారు. సర్వే పూర్తయ్యేంత వరకు ఈ వివరాలను నమోదు చేస్తున్న మొబైల్ ఫోన్ కూడా మార్చకూడదన్నారు. సర్వేపై అవగాహన కోసం ఈ నెల 20, 21 తేదీల్లో మండల స్థాయిలో, 22వ తేదీ సచివాలయాల స్థాయిలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. వలస వెళ్లిన వారు కూడా ఈ సర్వే దృష్ట్యా స్వగ్రామాలకు చేరేలా వారి కుటుంబ సభ్యులతో ముందుగానే మాట్లాడాలని సూచించారు. ఈసర్వే జరుగుతున్న తీరును డివిజన్ స్థాయి అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మానాయక్, గిరిజన సంక్షేమ అధికారి జగన్నాథరావు, బీసీ సంక్షేమ అధికారి అంజల, మైనార్టీ సంక్షేమ అధికారి సునీల్ కన్నా, సచివాలయాల నోడల్ అధికారి ఉషారాణి, జెడ్పీ డిప్యూటీ ఎడ్యుకేషన్ అధికారి సుబ్బారావు, జెడ్పీ డిప్యూటీ సీఈఓ హనుమంతరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మన అమ్మాయి...అదరగొట్టింది

- అండర్–15 క్రికెట్ టోర్నీలో 79 పరుగులు చేసిన ఆంధ్రా జట్టు కెప్టెన్ సేతుసాయి



వి.సేతు సాయి

ఒంగోలు: మన అమ్మాయి అదరగొట్టింది... దీంతో వడోదర క్రికెట్ స్టేడియం (గౌహతి) చప్పట్లతో మార్మోగింది. సంతనూతలపాడు ఎస్సై వి.ఆంజనేయులు కుమార్తె వీ.సేతు సాయి ప్రకాశం జిల్లా మహిళా క్రికెటర్. ప్రస్తుతం అండర్ 15 కేటగిరీలో ఆంధ్రా క్రికెట్ కెప్టెన్ కూడా. వడోదర క్రికెట్ స్టేడియంలో శనివారం ఆంధ్రా క్రికెట్ జట్టు–అరుణాచల్ ప్రదేశ్ జట్ల మధ్య పోరు జరిగింది. ఈ పోరులో తొలుత బ్యాటింగ్ చేపట్టిన ఆంధ్రా జట్టు ఏకంగా 35 ఓవర్లలో 294 పరుగుల భారీ స్కోరు చేసింది. ఇందులో ఓపెనర్‌గా బరిలోకి దిగిన జట్టు కెప్టెన్ వీ.సేతు సాయి ఏకంగా 12 బౌండరీలతో 65 బంతుల్లో 79 పరుగులు చేయగా, మరో ఓపెనర్, కీపర్ అయిన విద్యాశ్రీ 63 బంతుల్లో 15 బౌండరీలతో 91 పరుగులు చేసి అరుణాచల్ ప్రదేశ్ జట్టుకు చుక్కలు చూపించారు. వీరిద్దరి దెబ్బకు అనంతరం బరిలోకి దిగిన అరుణాచల్ ప్రదేశ్ జట్టు 33.4 ఓవర్లలో కేవలం 79 పరుగులు మాత్రమే చేసి ఆలౌట్ అయింది. దీంతో ఏసీఏ అడ్‌హక్ కమిటీ కన్వీనర్ మారెడ్డి రాఘవరెడ్డితోపాటు జిల్లా మహిళా క్రికెటర్లు సేతుసాయికి అభినందనలు తెలిపారు.

క్లుప్తంగా

ఘాట్ రోడ్డులో ప్రయాణిస్తున్న కారులో మంటలు


● దోర్నాల నుంచి శ్రీశైలం వెళ్తుండగా చోటుచేసుకున్న ఘటన



దగ్ధమవుతున్న కారు

పెద్దదోర్నాల: ఘాట్ రోడ్డులో ప్రయాణిస్తున్న ఓ కారు మంటల్లో చిక్కుకుని పూర్తిగా దగ్ధమైంది. ఈ సంఘటన పెద్దదోర్నాల మండల పరిధిలోని శ్రీశైలం ఘాట్ రోడ్డులోని శిఖరేశ్వరం సమీపంలో శుక్రవారం రాత్రి 9 గంటలకు చోటు చేసుకుంది. ఈ సంఘటనలో కారులో ప్రయాణిస్తున్న ప్రయాణికులకు ఎటువంటి గాయాలు లేకుండా సురక్షితంగా బయట పడటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. స్థానికుల కథనం మేరకు కడప జిల్లా పోరుమామిళ్లకు చెందిన గాలి మురళీమోహన్ శ్రీశైల పుణ్యక్షేత్రంలో అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో పనుల్లో పని చేసే కార్మికులకు జీతాలు చెల్లించేందుకు పోరుమామిళ్ల నుండి ఏపీ 21 బీఎల్ 0459 డస్టర్ కారులో శ్రీశైలం వెళ్తుండగా శిఖరం సమీపంలోని బయ్యన్నసెల వద్ద ఈ ప్రమాదం చోటు చేసుకుంది. సంఘటనకు సంబంధించిన సమాచారం అందుకున్న నంద్యాల జిల్లా శ్రీశైలం ప్రాజెక్టు కాలనీకి చెందిన అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. దీంతో శ్రీశైలం ఘాట్‌రోడ్డులో వాహనాల రాకపోకలకు ఏర్పడిన కొద్దిపాటి అంతరాయం తొలిగింది. షార్ట్ సర్క్యూట్‌తోనే కారులో మంటలు చెలరేగి ఉంటాయని పోలీసులు భావిస్తున్నారు.

జనగళం



ఇంటికి యజమానురాలినయ్యాను



ఇల్లు లేక అద్దె ఇళ్లల్లో, కొంత కాలం బంధువుల ఇళ్లల్లో కాపురం ఉంటున్నాం. గత ప్రభుత్వంలో ఇంటి పట్టా ఇస్తారని ఐదేళ్లు ఎదురు చూశాం. కానీ ఎవరికీ ఇంటి పట్టా ఇవ్వలేదు. మేము చేసే కూలి పనుల్లో కొంత అద్దె ఇంటికే సరిపోతుంది. జగనన్న ప్రభుత్వం వచ్చిన తరువాత గాదెపాలెంలో స్థలం కొనుగోలు చేసి జగనన్న లేఅవుట్లు వేశారు. అందులో ఇళ్ల పట్టా ఇచ్చారు. ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్కీమ్ రూ.1.80 లక్షలతో, ఇంకొంత డబ్బు కలిపి ఇల్లు నిర్మించుకున్నాం. సొంత ఇల్లు ఏర్పడిన తరువాత స్వేచ్ఛగా ఉండే ధైర్యం వచ్చింది. స్థలం కొనుగోలు చేసి ఇళ్ల పట్టాలు ఇవ్వటం ఎంతో సంతోషంగా ఉంది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికు రుణపడి ఉంటాం.

– కొమ్ము వెంకాయమ్మ, గాదెపాలెం, కొత్తపట్నం మండలం

ఒక రోజులో మూడు రకాల సర్టిఫికెట్లు మంజూరు



ఒక రోజులో మూడు రకాల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడం చాలా సంతోషంగా ఉంది. నాకు ఏడాది క్రితం పక్షవాతం వచ్చి కాళ్లు పని చేయడంలేదు. పింఛన్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు వెళ్తే సదరం సర్టిఫికెట్ కావాలన్నారు. దీంతో దరఖాస్తు చేసుకున్నారు. వెరిఫికేషన్ కోసం మార్కాపురం రమ్మంటే గతంలో వెళ్లొచ్చాను. అయినా సర్టిఫికెట్ రాలేదు. జగనన్న సురక్ష కార్యక్రమం సందర్భంగా వలంటీర్లు, సచివాలయ సిబ్బంది మా ఇంటికి వచ్చి అవసరమైన పత్రాలు తీసుకుని గ్రామ సభలో నా పేరు పిలిచి పైసా ఖర్చు లేకుండా సదరం, నేటివిటీ, ఆదాయ ధ్రువీకరణ మూడు రకాల పత్రాలు నాకు అందజేశారు. ముఖ్యమంత్రి జగనన్న పేదల కోసం ఇలాంటి కార్యక్రమాలు చేయడం సంతోషం. ఆయన మేలు మరువలేను.

– కంచర్ల నారాయణ,పెద ఉల్లగల్లు, ముండ్లమూరు మండలం

జగనన్న కాలనీలో ఇల్లు మంజూరు



నాకు గుండ్లాపల్లి జగనన్న కాలనీలో ప్లాటు ఇచ్చారు. ఇంటి వసతి లేక నా కొడుకు ఇంట్లో కొడుకు, కోడలితో కలిసి ఒక చిన్న గదిలో ఉంటున్న నాకు జగనన్న కాలనీలో ఇల్లు రావడం సంతోషంగా ఉంది. ఇల్లు కట్టుకుని నేను వేరుగా ఉంటున్నాను. జగనన్న పుణ్యాన నాకు స్వంత ఇల్లు ఏర్పాటైంది. మాలాంటి పేదలకు ఇళ్లు ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డికి ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను. పేదల పక్షపాతి అని జగన్ నిరూపించుకున్నారు.

– గోవిందు, గుండ్లాపల్లి, మద్దిపాడు మండలం

నా ప్రాణాలు నిలిపారు



కూలిపని చేసుకుని జీవనం సాగిస్తున్న నాకు ఇటీవల గుండెల్లో నొప్పిగా ఉండడంతో మద్దిపాడు ఆస్పత్రికి వెళ్లి చూపించుకోగా ఈసీజీ తీసి గుండె పరిస్థితి బాగాలేదని, వెంటనే సర్జరీ చేయించాలని చెప్పడంతో ఒక్కసారిగా భయం వేసింది. నాకు ముగ్గురు పిల్లలు. అబ్బాయి బీటెక్, అమ్మాయిలు డిగ్రీ, ఇంటర్ చదువుతున్నారు. కూలి పనులతో జీవనం సాగిస్తున్న నాకు పిల్లల చదువులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుణ్యాన ఎటువంటి ఇబ్బంది కలగలేదు. కానీ వారి భవిష్యత్తు పై భయం వేసింది. డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీలో నాకు ఒంగోలు హార్ట్ ఆస్పత్రిలో సర్జరీ చేశారు. సుమారుగా రూ.4.75 లక్షల విలువైన సర్జరీ ఉచితంగా చేసి మందులు ఇచ్చి పంపించారు. మూడు నెలలుగా ఇంటి వద్దనే విశ్రాంతి తీసుకుంటున్నాను. ఆసరా డబ్బుకూడా నా బ్యాంక్ ఎకౌంట్‌కు జమైంది. జగనన్నే లేకపోతే మా కుటుంబ పరిస్థితి ఏమిటో ఆలోచన చేసే సాహసం కూడా చేయలేం. జగనన్న చల్లగా ఉండాలి.

– కర్రె రాఘవులు (53), వెల్లంపల్లి, మద్దిపాడు మండలం

ఘనంగా అయోధ్య కలశాల శోభాయాత్ర



పవిత్ర అక్షింతలకు కలశాలతో శోభాయాత్ర నిర్వహిస్తున్న విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు

ఒంగోలు మెట్రో: శ్రీరామనామ మహామంత్ర స్మరణతో అయోధ్య నుంచి ఒంగోలు చేరిన పవిత్ర అక్షింతల కలశాలను స్థానిక గాంధీరోడ్డు గీతా మందిరం వద్ద నుంచి బృందావన్‌నగర్ మురళీకృష్ణ మందిరం వరకు విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) ఆధ్వర్యంలో శోభాయాత్రగా తీసుకెళ్లారు. ముందుగా గీతా మందిరంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా పురోహిత ప్రముఖ్ వ్యామిజాల ప్రసన్నకుమార్‌శర్మ, జిల్లా అధ్యక్షుడు తూనుగుంట మల్లికార్జునరావుస్వామి, చలువాది బదరీనారాయణ అక్షింతల కలశాలకు వైదికయుక్తంగా పూజలు చేశారు. కలశ పూజలో శ్రీరాముల వారిని ఆవాహన చేసి అధిష్ఠింపజేశారు. అనంతరం గీతా పరివార్ భక్త బృందం, విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు, వివిధ హైందవ సంఘ సభ్యులు కలశాలను తలపై పెట్టుకుని కాషాయ ధ్వజాలను చేపట్టి శ్రీరామనామ మహామంత్రాన్ని జపిస్తూ గాంధీరోడ్డు, పీవీఆర్ బాలికల పాఠశాల మీదుగా మంగమూరు రోడ్డు నుంచి బృందావన్‌నగర్ శ్రీమురళీకృష్ణ మందిరానికి చేరారు. ఈ సందర్భంగా ప్రాంత సత్సంగ ప్రముఖ సోమ సుబ్బారావు మాట్లాడుతూ జనవరి 22వ తేదీ అయోధ్యలోని రామమందిరంలో శ్రీరామ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు రామ జన్మభూమి తీర్థ ట్రస్ట్ ముహూర్తం నిర్వహించారని తెలిపారు. ఆ కార్యక్రమాలలో భాగంగా నవంబర్ 5వ తేదీ ప్రాణ ప్రతిష్ఠ వేడుకలను ఘనంగా నిర్వహించారని చెప్పారు. ఆ వేడుకల్లో ఉపయోగించిన పవిత్ర అక్షింతలు దేశవ్యాప్తంగా ప్రజలందరికీ చేరే విధంగా, శ్రీరామ ప్రతిష్ఠ మహోత్సవానికి ప్రతిఒక్కరినీ ఆహ్వానిస్తూ స్వామివారి చిత్రపటాలను పంపిణీకి సంకల్పించి ప్రతి జిల్లాకు అక్షింతలు పంపించారని తెలిపారు. మన జిల్లాకు వచ్చిన అక్షింతలకు శోభాయాత్ర నిర్వహించి ఈ నెల 22వ తేదీ మండలాలకు పంపిణీ చేయనున్నట్లు వివరించారు. జిల్లా వ్యాప్తంగా జనవరి 1 నుంచి 5వ తేదీ వరకు పవిత్ర అక్షింతలను ప్రతి ఇంటికి విశ్వహిందూ పరిషత్, ఆర్‌ఎస్‌ఎస్, తదితర హైందవ సంఘాల సభ్యులు పంపిణీ చేస్తారని తెలిపారు. శోభాయాత్రలో వీహెచ్‌పీ నగరాధ్యక్షుడు పసుమర్తి వెంకటేశ్వర్లు, కార్యదర్శి గోలిమి వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షుడు జిల్లెల్లమూడి వెంకటేశ్వర్లు, పి.హరిబాబు, ప్రచార ప్రముఖ్ రాధారమణగుప్తా జంధ్యం, తదితరులు పాల్గొన్నారు.

300 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



పట్టుకున్న రేషన్‌బియ్యంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

బేస్తవారిపేట: అక్రమంగా లారీలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని బేస్తవారిపేట జంక్షన్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శనివారం పట్టుకున్నారు. యర్రగొండపాలెం నుంచి కర్ణాటక రాష్ట్రానికి రేషన్‌బియ్యం బస్తాలను లారీలో తరలిస్తున్నారనే సమాచారం అందడంతో కలెక్టర్, పౌరసరఫరాలశాఖ అధికారుల ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించారు. రూ.11.10 లక్షల విలువైన 300 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని యర్రగొండపాలెం మండలం గంగపాలెం లక్ష్మీవెంకటేశ్వర రైస్‌మిల్లు యజమాని పువ్వాడ శ్రీనివాసులు, అక్రమ రవాణాకు సహకరించిన వాహన యజమాని కుందుర్రు యోగిరెడ్డి, లారీ డ్రైవర్ ఊటుకూరు మరియబాబులపై 6ఏ కేసు నమోదు చేశారు. సీజ్ చేసిన బియ్యంను కంభం రేషన్ గోడౌన్ ఇన్‌చార్జి బీవీఎస్ ప్రసాద్‌కు అప్పగించారు. తనిఖీలు నిర్వహించిన వారిలో ఒంగోలు ఈడీటీ ఆర్‌వీఎస్ కృష్ణమోహన్, శింగరాయకొండ ఈడీటీ సీహెచ్ కృష్ణమోహన్, పొదిలి ఈడీటీ కే డేవిడ్‌బాబు, దొనకొండ ఈడీటీ ఎస్.రామనారాయణరెడ్డి ఉన్నారు.

జీజీహెచ్‌లో జగనన్న సురక్ష కంట్రోల్ రూం



కంట్రోలు రూంను ప్రారంభించిన రిమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్ భగవాన్ నాయక్, ఆర్‌ఎంఓ డాక్టర్ తిరుమలరావు

ఒంగోలు టౌన్: జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా జిల్లాలో నిర్వహించిన వైద్య శిబిరాల్లో మెరుగైన చికిత్స కోసం జీజీహెచ్‌కు రెఫర్ చేసిన రోగులకు ఉత్తమ సేవలు అందించనున్నారు. దీనికోసం జీజీహెచ్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు సూపరెంటెండెంట్ డాక్టర్ భగవాన్ నాయక్ తెలిపారు. శనివారం ఆర్‌ఎంఓ కార్యాలయానికి ఎదురుగా ఏర్పాటు చేసిన కంట్రోలు రూంను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో స్పెషలిస్టు వైద్యులు పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించారని తెలిపారు. అవసరమైన వారికి మెరుగైన చికిత్సల కోసం రెఫర్ చేశారని వివరించారు. ఆయా కేసుల్లో హాస్పిటల్‌కు రాని వారికి ఫోన్ చేసి కౌన్సెలింగ్ ఇచ్చేందుకుగాను 30 మంది నర్సింగ్ సిబ్బంది నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జీజీహెచ్ ఇన్‌చార్జి ఆర్‌ఎంఓ డాక్టర్ తిరుమలరావు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

టంగుటూరు: గుర్తు తెలియని కారు ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన సూరారెడ్డిపాలెం ఐటీసీ పెట్రోల్ బంక్ వద్ద శనివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నాగులుప్పలపాడు మండలం అమ్మనబ్రోలు గ్రామానికి చెందిన షేక్ జానీ బాష (55) ఐటీసీఎల్‌లో పంచర్ దుకాణం నడుపుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. ఈ క్రమంలో ఒంగోలు వైపు రోడ్డు దాటుతున్న క్రమంలో డివైడర్ దిగుతుండగా గుర్తుతెలియని కారు బలంగా ఢీకొట్టింది. దీంతో జానీబాష అక్కడికక్కడే మృతిచెందాడు. సంఘటనా స్థలానికి ఎస్సై ఖాదర్ బాషా చేరుకొని ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అండర్ 17 బేస్‌బాల్ పోటీల్లో ప్రకాశంకు ప్రథమ స్థానం



ప్రథమస్థానంలో నిలిచి ట్రోఫీ అందుకుంటున్న అండర్ 17 ఎస్‌జీఎఫ్ బేస్‌బాల్ బాలికల జట్టు

ఒంగోలు: అండర్ 17 స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో బాలికల విభాగంలో ప్రకాశం జిల్లా జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. ఈనెల 15 నుంచి 17వ తేదీ వరకు పెదకాకాని మండలం వెనిగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అండర్ 17 రాష్ట్ర స్థాయి పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో విజయం సాధించి జిల్లాకు వచ్చిన బాలికల జట్టుకు ఎస్‌జీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వీఎస్ సుబ్బారావు, కె.వనజ అభినందనలు తెలిపారు.

పంచాయతీ పరిపాలనపై శిక్షణ

● పాల్గొన్న డీపీవో నారాయణరెడ్డి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీపీవో నారాయణరెడ్డి

ఒంగోలు సిటీ: గ్రామ పంచాయతీ పరిపాలన విధానం, ఆర్థిక వనరుల పెంపుదలపై శిక్షణ ఇస్తున్నట్లు డీపీవో జి.వి.నారాయణరెడ్డి తెలిపారు. శనివారం స్థానిక డ్వామా ఆఫీస్‌లో డివిజనల్ పంచాయతీ అధికారులు, విస్తరణాధికారులు, కార్యదర్శులు, ఆర్పీలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గ్రామ పంచాయతీ పరిపాలనలో అవసరమైన సెక్షన్లు, సమాచారంపై అందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. గ్రామ పంచాయతీలో ప్రతి నెలా సమావేశం నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ కార్యదర్శులంంతా విధిగా నోట్‌ఫైల్ రాయడం నేర్చుకుని అనుసరించాలన్నారు. ప్రతి నెలా సమావేశం నిర్వహించేందుకు పంచాయతీ కార్యదర్శి చట్టంలో నిర్దేశించబడిన విధంగా సంబంధిత జీవో, సెక్షన్ల ప్రకారం నోట్ ఫైల్‌ను అనుసరిస్తూ వెళ్లాలన్నారు. వీలుపడని పక్షంలో సంబంధిత పంచాయతీ కార్యదర్శి సదరు సమాచారాన్ని పైఅధికారికి తెలియజేయాలన్నారు. గ్రామ పంచాయతీలో పనులు చేపట్టే విధానం, ఆ పనులకు చెల్లింపు చేయాల్సిన విషయంలో పాటించాల్సిన నియమాలను గ్రామ పంచాయతీల సమాచార బోర్డులలో నిర్ణీత కాలవ్యవధిలో ఉంచాలని సూచించారు. మినిట్స్, రికార్డులను ఎవరెవరు చూడవచ్చు, ఏయే సందర్భాలలో చూడవచ్చు, ఆడిట్ – తనిఖీకి గల సంబంధం ఏమిటనే విషయాల గురించి క్షుణ్ణంగా తెలుసుకోవాలని సూచించారు. ప్రతిఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని డీపీవో సూచించారు.